నేడు యథావిధిగా 'జగనన్నకు చెబుదాం'

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్-ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కోవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

కరువు మండలాలకు కసరత్తు

జిల్లాలో కరువు మండలాల ఎంపిక కసరత్తు ఊపందుకుంది. 2023-24 ఖరీఫ్ సీజన్ వర్షపాతం లేమి కారణంగా ఎదురైన తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం కరువు మండలాల ఎంపిక ప్రమాణాల ఆధారంగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో రాజకీయ పరి స్థితులు వేడెక్కిన నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లాలో కరువు మండలాలను ప్రకటిస్తే ఎంతటి దుమారం రేగుతుందోననే అందోళనతో కరువు మండలాలను ప్రకటించే అవకాశం లేదనే వాదన వినిపిస్తోంది.

జిల్లాలో 17 మండలాలు ఎంపిక?
రాజకీయమే రైతుల పాలిట శాపం
ప్రభుత్వ ఆమోదంపై అనుమానాలు

ప్రజాశక్తి - కడపప్రతినిధి

ఖరీఫ్ సీజన్ తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎర్కొంటోంది. జిల్లాలో 36 మండలాలున్నాయి. 2023-24 ఖరీఫ్ సీజన్‌లో 2,11,553 ఎకరాల్లో పంటలు సాగు చేయాలనే జిల్లా వ్యవసాయశాఖ లక్ష్యానికి గండి పడింది. 1,48,889 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన 60 నుంచి 70 వేల ఎకరాలు బీళ్లుగా మారిన దృశ్యం దర్శనమిస్తోంది. ఇదిలాఉండగా వర్షాభావ పరిస్థితుల నెలకొన్న నేపథ్యంలో 381 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 358 మి.మీ నమోదైన నేపథ్యంలో వర్షభావ పరిస్థితుల్లో సాగు విస్తీర్ణంలో కోత, తాగునీటి ఎద్దడి, పడిపోతున్న భూగర్భజలాలు, పశుగ్రాసం, ఉపా ధికి హామీ కొరవడడం, వలసలు తదితర ఆరు రకాల పారా మీటర్లను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా జిల్లాల్లోని 36 మండలాల్లో డ్రైస్పెల్స్ బారిన పడిన 17 మండలాలను ప్రధానంగా పరిశీలించినట్లు తెలుస్తోంది. ఇందులో బి.మఠం, కాశినాయన, పోరుమామిళ్ల, బద్వేల్, గోపవరం, చాపాడు, ప్రొద్దుటూరు, పులివెందుల, యర్రగుంట్ల, అట్లూరు, ఒంటిమిట్ట, పెండ్లిమర్రి, చక్రాయపేట సహా మరో నాలుగు మండలాలను ఎంపిక చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

జిల్లాలో కరువు మండలాలను ఎంపిక చేసినప్పటికీ ఆమోదం లభించడం అనుమానమేననే వాదన వినిపిస్తోంది. రాష్ట్రంలో నెల కొన్న రాజకీయ పరిస్థితులు జిల్లా రైతాంగానికి శాపంగా మారే అవ కాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సొంత జిల్లాలోనే కరువు తాండవం చేస్తున్నట్లు ప్రకటిస్తే రాజకీయంగా విమర్శలు ఎదుర్కోవడంతోపాటు నష్టపోయే అవకాశాలను బేరీజు వేసుకుని కరువు మండలాలను ప్రకటించే అవకాశాలు లేవనే వాదన వినిపిస్తోంది.

పౌష్టికాహారంతో ఆరోగ్యం కాపాడుకోవచ్చు

ఐసిడిఎస్ పీడీ ఎం. ధనలక్ష్మి

ముఖా ముఖి

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలలో చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందుబాటులో ఉండి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి మిద్దింటి ధనలక్ష్మి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ఐసిడిఎస్ ప్రాజెక్టుల పనితీరు అంగనవాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఎలా అందించాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆమె వివరించారు.

జిల్లా వ్యాప్తంగా అంగన్వాడి కేంద్రాల వివరాలు తెలపండి?

జిల్లాలో 11 ఐసిడిఎస్ ప్రాజెక్టులున్నాయి. బి కొత్తకోట, చిట్వేలి, లక్కిరెడ్డిపల్లె, మదనపల్లె, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, టి. సుండుపల్లె, తంబళ్లపల్లి, వాల్మీకిపురం ప్రాంతాలలో ఉన్నాయి. జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిక అధికారి కార్యాలయం రాయచోటి జిల్లా కేంద్రంలో ఉంది.

ఐసిడిఎస్ పని వివరాలు తెలపండి?

ఐసిడిఎస్ పరిధిలో రోజూ ఉదయం 9 గంటలకు అంగన్వాడీ కేంద్రాలను తెరవడం, మూడేళ్ల నుంచి (ప్రీ స్కూల్ పిల్లలకు) 11:00 గంటలకు ఉడకబెట్టిన కోడిగుడ్డు ఇవ్వడం, ప్రభుత్వ నియమ నిబంధనలను ప్రకారం ప్రీ స్కూల్ యాక్టివిటీస్ (పిపి-1,పిపి-2) జరపడం, వారికి ఆటపాటలు నేర్పడం, సాయంత్రం 3:00 గంటలకు 100 మిల్లీ లీటర్లపాలు ఇవ్వడం, 4:00 గంటలకు అంగన్వాడీ కేంద్రాలను మూసివేస్తారు. . 7 నెల నుంచి 3 సంవత్సరముల పిల్లలకు బాలామృతం 2.5 కేజీలు, 25 గుడ్లు, 1.5లీటర్ల పాలు టిహెచ్ఆర్ ద్వారా ఇంటికి ఇస్తూ వారి తల్లితండ్రులకు వాటి పోషకాల గురించి అవగాహన కల్పిస్తారు. ఇంకా గర్భిణులకు, బాలింతలకు పది రకాల పోషక విలువలు కల్గిన బలవర్ధక ఆహార పదార్థాల కిట్‌ను అందజేస్తారు. వారికి రక్తహీనత లేకుండా చూడడం, 7 నెలలనుంచి 3 సంవత్సరము ల పిల్లలకు పోషకాహార లోపం లేకుండా చూడడం, వారికి బలవర్ధక ఆహారం అందించడం, పిల్లలకు ఒకపూట పోషకాలతో కూడిన సంపూర్ణ భోజనం పెడుతారు. ప్రతి మొదటి శుక్రవారం, మూడవ శుక్రవారం ఆరోగ్య పరపైన హెల్త్ చెక్ అప్‌లు చేయిస్తూ ఆశా వర్కర్, ఎఎన్ఎం, మెడికల్ ఆఫీసరుతో తగిన సలహాలు ఇప్పించడం, పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించడం జరుగుతుంది.

జిల్లా వ్యాప్తంగా ఖాళీల పోస్టుల వివరాలు తెలపండి?

అంగన్వాడీకార్యకర్తలు 8, మినీ అంగన్వాడీ కార్యకర్తలు 7, అంగన్వాడీ సహాయకురాళ్లు 22, అంగన్వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

బాల్య వివాహాలను అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

బాల్యవివాహాలను నివారించడానికి జిల్లా ,మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం. అంగన్వాడీ కార్యకర్త నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు అందరూ కలిసి గ్రామాలలో పాఠశాలలో బాలికలు హాస్టల్లో పిల్లలకు తల్లిదండ్రులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ఐసిడిఎస్ అదనపు కార్యాలయాలకు ప్రతిపాదన ఏమైనా పంపారా?

లేదు, జిల్లలో సరిపడా ప్రాజెక్టులు ఉన్నాయి.

గర్భిణులు, బాలింతలు, తల్లిదండ్రులకు సలహాలు ఏమైనా ఇవ్వాలను కుంటున్నారా?

అంగన్వాడీ కేంద్రం ద్వారా సరఫరా చేసిన పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు క్రమం తప్పక తీసుకోవడం, అంగన్వాడీ సిబ్బంది, హెల్త్ డిపార్ట్మెంట్ వారు చెప్పిన తగు సూచనలు, సలహాలు పాటించడం. వారి కుటుంబ సభ్యులు కూడా వారికి సహకరించాలనికోరుతున్నాం.

చంద్రబాబు భద్రతపై అనుమానాలు : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జైలులో ప్రాణహాని ఉందని, ఆయన భద్రతపై పలు అనుమానాలు ఉన్నాయని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్‌రాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరుమల క్షేత్రంలో నాటి ప్రధాని పీవీ నరసింహారావుకు ఆకాశం నుంచి ముప్పు ఉందని తెలిసి రక్షణ కల్పించారని, నేడు చంద్రబాబు విషయంలో ప్రాణహాని ఉందని తెలిసి కూడా ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టలేదని విమర్శించారు. బాబును అంతమొందిస్తామని నేరుగా ఎస్‌పికే లేఖ పంపినా జైలు సూపరిండెండెంట్ ఇది ఫేక్ అని కొట్టివేయడం ఎవరిని మోసం చేయాలని ప్రశ్నించారు. బటన్ కెమెరాతో అనునిత్యం బాబు కదలికలను ఫొటోలు తీసి బయటకు చేరవేస్తున్నారని, జైలుపై డ్రోన్ కెమెరాలు ఎగరవేస్తున్నారని, ఖైదీలకు గంజాయి పొట్లాలు విసురుతున్నారని, ఆ జైలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఉందని, అక్కడ తమ నాయకుడికి రక్షణ ఉండదని తేల్చి చెప్పారు. బాబును అంతమొందించేందుకు వేలకోట్లలో సుపారీ తీసుకుని ముంబై నుంచి 750 మంది సిద్ధంగా ఉన్నట్లు హాన్స్ ఇండియాలో ప్రచురితమైన సమాచారాన్ని కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. బాబును అరెస్టు చేసి 50 రోజులు దాటినా అధికారులు కోర్టుకు సాక్షాధారాలు సమర్పించలేకున్నారని, అక్రమ అరెస్టుకు ఇదే నిదర్శనమని తెలిపారు. తమ నాయకుడికి ఏదైనా హాని జరిగితే బెంగళూరు, హైదరాబాద్, పులివెందులలోని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గృహాలు కూడా నిలబడలేవని, జగన్ రెడ్డి దేశంలో ఎక్కడా నిలువలేరని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి మండల రూరల్ అధ్యక్షులు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, మండల పట్టణ అధ్యక్షులు డిఆర్ఎల్ మణి, మైనారిటీ నాయకులు అబూబకర్, కొండయ్య నాయుడు, గొంటు సురేష్ పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బత్యాల చెంగల్‌రాయుడు

బిఎస్‌పిని బలోపేతం చేద్దాం

- రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి

ప్రజాశక్తి - రాయచోటి

బహుజన సమాజ పార్టీని బలోపేతం చేద్దామని రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి పేర్కొన్నారు. రాజ్యాధికార చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం స్థానిక ఎన్జీవోహోమ్‌లో సమీక్ష సమావేశం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు అబ్బవరం యుగంధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పరంజ్యోతి మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు బహుజనలకు ఏమి చేశారో చెప్పాలన్నారు రాయలసీమలో ఉపాధి పని లేక ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారు. రత్నాల సీమగా ఉన్న రాయలసీమను రాళ్లసీమగా మార్చాలని ఆరోపించారు. రాష్ట్రంలో కనీసం రాజధాని కూడా లేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి కార్పొరేషన్‌లో నిధులు కూడా లేకుండా చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపిలే పాలిస్తున్నాయని ఈ పార్టీల వల్ల బహుజనులు అనేక ఇబ్బందులకు పడుతున్నారని తెలిపారు. రాబోయే రోజులలో వైసిపిని తగిన గుణపాఠం చెప్పి బిఎస్‌పిని అధికారంలోకి తీసుకురావడానికి అందరూ కలిసిమెలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో బిఎస్‌పి అధికారంలోకి వస్తే బహుజన అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. జిల్లా అధ్యక్షులు యుగంధర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామస్థాయి నుంచి కమిటీలు వేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాళ్లపాక సుబ్రహ్మణ్యం, జిల్లా ఇన్‌ఛార్జులు ఆంజనేయులు, బాలాజీ, ఆరు నియోజకవర్గాల అసెంబ్లీ అధ్యక్షులు, మండల అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి

చేనేత రంగానికి జిఎస్‌టిని మినహాయించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చేనేత రంగానికి జిఎస్‌టి నుంచి మినహాయింపు ఇవ్వాలని జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరి డిమాండ్ చేశారు. ముందుగా మదనపల్లి పట్టణం, నీరుగట్టువారిపల్లిలో పురం నగేష్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ నాయకులు ,కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా గంగారపు రాందాస్ చౌదరి మాట్లాడుతూ 34వ వార్డులో గత మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీచేసి జనసేన పార్టీ కోసం నిరంతరం కష్టపడే నిబద్ధత కలిగిన నాయకుడు పురం నగేష్ అని కితాబునిచ్చారు. మున్సిపల్ ఎన్నికలలో ఎన్ని ప్రలోభాలు పెట్టినా లొంగని జన సైనికుడికి ఇంటింటా అపూర్వ స్పందన వచ్చిందన్నారు. చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను గురించి అడిగి తెలుసుకొని జనసేన, టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే చేనేత కార్మికుల సమస్యలు తీరుతాయని భరోసానిచ్చారు. చేనేత పరిశ్రమ కావాల్సిన ముడి సరుకులపై రాయితీ అందిస్తామని, విరివిగా రుణాలు మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, రాష్ట్ర చేనేత విభాగ నాయకులు అడపా సురేంద్ర, రూరల్ మండల అధ్యక్షులు గ్రానైట్ బాబు, చంద్రశేఖర, గడ్డం లక్ష్మిపతి పాల్గొన్నారు.

12 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి- రాయచోటి

పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లెలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 12 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, యర్రావారిపాలెం, కె.వి.పల్లి, కలకడ, కలికిరి, పెద్దమండెం, గుర్రం కొండ, కదిరి, ఎన్.పి.కుంట, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 30 మందికి పరీక్షలు చేశారు. అందులో అర్హులైన 12 మందికి ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 25 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్ కోసం వచ్చిన రోగులతో పాటు వారి వెంట ఉండే వారికి భోజన వసతి కల్పించారు. ండు నెలలపాటు అమెరికాకు వెళ్లి ఆదివారం తిరిగి ఇండియాకు వచ్చిన లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఅర్ స్వరూప గుప్తాకు ఆసుపత్రి సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో లయన్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప గుప్తా,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాష,లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ గాలివీటి శివరామిరెడ్డి,కంటి వైద్యులు సురేష్ బాబు,ఆప్మాలిక్ అసిస్టెంట్ మూలీ రాజగోపాల్ రెడ్డి,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

సమావేశంలో మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

అధికారుల నిర్లక్ష్యంపై ఎస్‌సి కమిషన్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-పీలేరు

అంబేద్కర్ భవనానికి స్థలం కేటాయింపులో రెవెన్యూ అధికారుల చూపుతున్న నిర్లక్ష్యంపై రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేసినట్లు మాల మహానాడు నాయకులు తెలిపారు. ఆదివారం పీలేరు మండల మాలమహానాడు కార్యాలయంలో మండల ప్రచార కార్యదర్శి దప్పేపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాయలసీమ జిల్లాల సహాయ కార్యదర్శి నగరిమడుగు సుభాష్, మాలమహానాడు అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున, ఆనంద్ మాట్లాడుతూ మాల మహనాడు ఆధ్వర్యంలో ఎనిమిది ఏళ్లుగా పీలేరు పట్టణంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని పలుమార్లు జిల్లా, మండల స్థాయి రెవెన్యూ శాఖ అధికారులకు ఎన్నో వినతులు సమర్పించినా, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన స్థలం కేటాయింపులో వారి నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక్క జిల్లా ఉన్నత స్థాయి అధికారికి అంబేద్కర్ భవనం కోసం స్థలాన్ని కేటాయించాలని ఎనిమిది నెలల ముందు వినతిపత్రాన్ని సమర్పిస్తే ' ఏం ఎస్‌సిలకు భూములు లేవా, మీ భూములు అంబేద్కర్ భవన నిర్మాణానికి కేటాయించండి' అని అవహేళనగా మాట్లాడుతూ కించపరిచారని వారు వాపోయారు. పీలేరు మండల పరిధిలో దొడ్డిపల్లి, ఎర్రగుంటపల్లి, గూడరేవుపల్లి, బొడుమల్లువారిపల్లి, రేగళ్లు, అగ్రహారం ఇలా వివిధ గ్రామ పంచాయతీల్లో అగ్రవర్ణాల భూ కబ్జాదారులు వేల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించి, అన్యాక్రాంతం చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారుల తీరును వారు తప్పుబట్టారు. భూకబ్జాదారులకు తమదైన శైలిలో వారికి వత్తాసు పలుకుతూ ప్రభుత్వ భూములను, ఎస్‌సి, ఎస్‌టి భూములను ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. అంబేద్కర్ భవన నిర్మాణానికి ఒక్క సెంటు భూమి కూడా లేదంటున్న రెవెన్యూ అధికారులు, పెద్దలు చెరువులు, కుంటలు, గుట్టలు, చివరికి శ్మశాలను కబ్జా చేస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు ఉండవని విమర్శించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం కార్యదర్శిగా అనిల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

రెడ్డి సంక్షేమ సంఘం కార్యదర్శిగా అనిల్‌కుమార్‌రెడ్డిని ఎన్నుకున్నారు. స్థానిక బెంగుళూరు రోడ్డులోని రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమేవేశం నిర్వహించారు. సమావేశంలో మదనపల్లె రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యదర్శి (సెక్రటరీ) గా డాక్టర్ ఐ. అనిల్ కుమార్ రెడ్డి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన సెక్రటరీ డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తన నమ్మకంతో ఇంతటి పదవి అప్పగించిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న జనసేన నాయకులు

వరద బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి

వరద బీభత్సవానికి అన్నమయ్య జలాశయం మట్టికట్ట కొట్టకపోయి ప్రాణ ఆస్తి నష్టం జరిగి రెండేళ్ల కావస్తున్నా ప్రభుత్వం ఇంతవరకు వారికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని జిల్లా జనసేనపార్టీ నాయకులు రామ శ్రీనివాస్, అసంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ హసన్‌బాష విమర్శించారు. అదివారం పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం జనసేన ఆధ్వర్యంలో 'చలో రాయచోటి 'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. జలాశయం కొట్టుకుపోవడంతో నిలువు నీడ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితులను ప్రభుత్వం పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి రెండేళ్ల గడుస్తున్నా ఇంతవరకు వరకు ఎలాంటి సదుపాయాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. వరద బాధితులకు న్యాయం జరిగేంత వరకు జనసేన ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. చలో రాయచోటి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, సానుభూతి, మద్దతు దారులు, ప్రజాసంఘాలు, వివిధ ప్రాంతాల నుంచి ప్రజలందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రదీప్, షబ్బీర్,మైనార్టీ సీనియర్ నాయకులు బాబుజాన్ పాల్గొన్నారు.

వైసిపి నాయకులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పీలేరు తహశీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ రెడ్డెప్పపై దాడికి యత్నించిన అధికార వైసిపి నాయకులను అరెస్టు చేయాలని టిడిపి రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోర్టు వివాదంలో ఉండే భూమికి తాను సర్టిఫికేట్ ఇవ్వడం కుదరదన్న సర్వేయర్ రెడ్డప్పపై వైసిపి నేతలు అనిల్ రెడ్డి,సునీల్ రెడ్డి దుర్భాషలాడుతూ దాడి ప్రయత్నించారు. సర్టిఫికెట్ ఇవ్వకపోతే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించి అసభ్య పదజాలంతో దూషించడం బాధాకరమన్నారు. వైసిపి పాలనలో అధికారులకే రక్షణ కరువైందన్నారు. తాము చెప్పినట్లు నడుచుకోని అధికారులను ఇబ్బంది పెట్టడం, వేధించడం, భయభ్రాంతులకు గురిచేయడం నాయకుల వైఖరికి నిదర్శనమన్నారు. నిజాయితీగా పని చేయడమే అధికారులు తప్పా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇటువంటి విధానాలను వైసిపి నాయకులు మానుకోవాలని హితవు పలికారు. ఈ ఘటనపై సర్వేయర్ రెడ్డెప్ప స్థానిక పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. సర్వేయరుపై దాడి చేసిన వైసిపి నాయకులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న సురేంద్రయాదవ్

అతిథులను సన్మానిస్తున్న మానవతా కుటుంబ సభ్యులు

ప్రతి ఒక్కరికీ మానవత్వం అవసరం

ప్రజాశక్తి - రాయచోటి

ప్రతి ఒక్కరికీ మానవత్వం అవసరమని మానవత సంస్థ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి,సెక్రెటరీ వెంకట్రమణ నాయుడు, రాయచోటి మానవత చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రతిభా జూనియర్ కళాశాలలో నెలవారీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి కెనరా బ్యాంక్ మేనేజర్ పవన్ కుమార్, శ్రీ షిర్డీ సాయి మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మనోజ్ కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వ్యవస్థాపకులు రామచంద్ర రెడ్డి మానవత సంస్థను ఏర్పాటు చేసి ఒక ఉన్నతమైన ఆశయంతో నిర్భాగ్యులకు సేవ చేస్తుండడం చాలా సంతోష దాయకమన్నారు. మానవత సంస్థ లో స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకోవడంతో పాటు సంస్థ ఆర్థికాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పవన్‌కుమార్, మనోజ్ కుమార్‌రెడ్డి 2023-24 సవత్సరానికి సంబంధించి ప్రస్తుత అధ్యక్షులు చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి 250 సభ్యత్వాలు నమోదు చేసినందుకు వారికి మానవత కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. గతంలో మానవత సంస్థకు విలువైన సలహాలు ఇస్తూ అత్యధికంగా సభ్యత్వాలు నమోదు చేసిన మానవత గౌరవ సలహాదారులు లోకనాథ రెడ్డి చేసిన సేవలను ఈ సమావేశంలో గుర్తు చేసుకొన్నారు.అదే విధంగా మానవత సభ్యులు శ్రీధర్ రెడ్డి కూడా ఈ ఏడాది 60 కి పైగా సభ్యత్వాలు నమోదు చేసినందుకు వారిని కూడా ప్రశంసించారు .మానవత సంస్థ ద్వారా సేవలు కొనసాగేందుకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ మానవత సంస్థ తరపున పేరు పేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ముఖ్య అతిథులుగా హాజరైన వారికి మానవత కుటుంబ సభ్యులు దుశ్శాలవతో సన్మానించి మానవత జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బ్రహ్మానందంరెడ్డి, శ్రీధర్ రెడ్డి, మస్తాన్, మహబూబ్ బాషా,తాతిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, జయచంద్ర రెడ్డి, విల్వా పతి రెడ్డి, నాగరాజ, పిఇటి మనోహర్ రెడ్డి, విశ్వనాథ రెడ్డి, మానవత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి హేయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నెల్లూరు జిల్లా కావలి వద్ద ఆర్‌టిసి ఆటోనగర్ డిపో డ్రైవర్ రామ్ సింగ్ పై దాడి చేసిన 14 మంది రౌడీలను వెంటనే అరెస్టు చేసి రిమాండుకు పంపి కఠినంగా శిక్షించాలని ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి శేఖర్ డిమాండ్ చేశారు. డ్రైవర్‌పై దాడికి నిరసనగా ఆదివారం ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి డిపో గ్యారేజ్ గేటు వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి, పగలు తేడా లేకుండా నిరంతరం ప్రయాణికుల సేవలో పనిచేస్తున్న ఆర్‌టిసి సిబ్బందికి ప్రభుత్వమే రక్షణ కల్పించాలని కోరారు. ప్రజలు, మేధావులు, విద్యార్థులు డ్రైవర్ పై దాడి పట్ల స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి దాడికి పాల్పడ్డ వారు ఎంతటి వారైనా వారిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపిపిటిడి జిల్లా ఉపాధ్యక్షులు చల్లా వెంకటేష్, డిపో అధ్యక్షులు సుబ్బయ్య, కార్యదర్శి మౌల, గ్యారేజ్ కార్యదర్శి సుబ్బయ్య, చలపతి, సీఎం కృష్ణ, ఖాదరయ్య, మోహన్, రాజు, నరసయ్య, రహమతుల్లా, సుబ్బన్న, షేక్ షా, వెంకటయ్య, బాష పాల్గొన్నారు.

కృత్రిమ కాలు అమర్చిన షేక్‌పీరాన్‌సాహేబ్‌తో మానవత సభ్యులు

సమాజ సేవే మానవత ధ్యేయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సమాజ సేవే మానవత ధ్యేయమని ఆ సంస్థ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం మాన వత సభ్యులు సమావేశం జరిగింది. ఈ సంద ర్భంగా ఆ సంస్థ ఆవిర్భావం నుండి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు ఇందులో భాగంగా అంగ వైకల్యంతో బాధపడుతున్న బి.కొత్తకోట పట్టణానికి చెందిన షేక్ పీరాన్ సాహేక్ మానవత సహకారంతో కృత్రిమ కాలు ఏర్పాటు చేయించామని తెలిపారు. వెలుగు ఉదయమోహన్ రెడ్డి, వెండవ ట్రెజర్ ఏర్పాటు చేయించిన వ్యవస్థాపకుల ఎన్.రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో తమ సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు క్రికారు చుడతామన్నారు. సమావేశంలో ప్రతినిధులు యస్.క్రిష్ణారెడ్డి, సుంకు కాలేజ్ ప్రిన్సిపల్ మంజునాథ్, రామచంద్రారెడ్డి, వాసుదేవరావు, రాఘవరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, జయచం ద్రారెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

పరీక్షకు హాజరైన విద్యార్థులు

'మిట్స్'లో సర్టిఫికెట్ కోర్స్ ఆన్‌లైన్ పరీక్ష

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులకు నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్హాన్స్ లెర్నింగ్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాసు వారు స్వయం అను పేరుతో నిర్వహించిన సర్టిఫికెట్ కోర్స్ ఆన్లైన్ పరీక్షను మూడు రోజుల పాటు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. సి.యువరాజ్ తెలిపారు. ఈ పరీక్ష లో 5244 మంది నమోదు చేసుకోగా 5009 మంది హాజరైనట్లు తెలిపారు. వివిధ సబ్జెక్ట్ లో ఆన్‌లైన్ పరీక్షను ఎన్ పిటిఇఎల్ వారు సంవత్సరానికి రెండు సార్లు నిర్వహిస్తారని అన్నారు. ఈ పరీక్షల లో ఉత్తీర్ణులు అయిన విద్యార్థులకు ఆన్‌లైన్ సర్టిఫికేట్‌ను ఎన్‌పిటిఇఎల్ వారు అందజేస్తారని, ప్రతి ఏటా తమ విద్యార్థులు, అధ్యాపకులు ఈ పరీక్షలు రాస్తారని తెలిపారు.

తాళ్లపాక సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న బిఎస్‌పి నాయకులు

బిఎస్‌పి బలోపేతానికి కృషి

-తాళ్లపాక సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

బిఎస్‌పి బలోపేతానికి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీనాయకులు బలోపేతం చేసి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని రైల్వేకోడూరు బిఎస్‌పి ఇన్‌ఛార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాళ్లపాక సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం జిల్లాస్థాయి బిఎస్‌పి కార్యవర్గ సమావేశంలో పాల్గొనడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా కార్యకర్తలు, నాయకులు అందరూ ప్రజల పక్షాన ఉండి పార్టీని ముందుకు తీసుకువెళ్లాలని తెలిపారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు ముందుంటుందని, కార్యకర్తలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకుని వస్తే కార్యవర్గ సమావేశంలో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య అధ్యక్షులు పరంజ్యోతి, నాయ కులు మస్తానయ్య, పోతేపల్లి హేమంతకుమార్, తాళ్లపాక నరసింహులు పాల్గొన్నారు.

నేడు గంగాపురంలో గడప గడపకూ...

ప్రజాశక్తి-కలకడ

గంగాపురం పంచాయతీలో సోమవారం గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిపి శ్రీదేవిరమేశకుమార్, మండల పార్టీకన్వీనర్ కమలాకర్‌రెడ్డిలు తెలిపారు. సోమవారం మండలంలోని గంగాపురం, దొడ్డిపల్లి పంచాయతీలలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరవుతారని తెలిపారు. పంచాయతీలోని సెరికన వంక వడ్డిపల్లి, గోపాల పురం, గంగాపురం కత్తివారిపల్లి, కురువపల్లి గ్రామాలలో పర్యటించ నున్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు, పార్టీ కన్వీనర్లు జెడ్‌పిటిసి, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జిలు, వైస్ ఎంపిపి, ఎంపిటిసిలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామవాలంటీర్లు, వైఎస్ఆర్‌పి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని తెలిపారు.

చంద్రబాబు అరెస్టు అక్రమం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టు అక్రమమని మాజీ మార్కెట్ చైర్మన్ కలాడి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం లక్కిరెడ్డిపల్లి మూడు రోడ్ల కూడలిలో టిడిపి కార్యకర్తలు, మైనార్టీ కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అన్యాయాలు, అక్రమాలు గ్రామస్థాయి నుంచి పెద్దల వరకు వ్యాపించాయని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో కోనం పేట సర్పంచ్ లక్ష్మీనారాయణ, బిసిసెల్ కార్యదర్శి బదుగువాసుదేవుడు, మంజూర్ రాఘవేంద్ర, తరుణ్‌యాదవ్, గౌస్ పీర్, రెడ్డప్పరెడ్డి, చినరాయుడు, నవాజ్ పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** వీయునంత త్వరగా టిడిపి అధినేత చంద్రబాబు జైలు నుంచి విడుదల కావాలని కోరుతూ మద్దతుగా కళ్లు తెరిపిద్దాం కార్యక్రమాన్ని మండలకేంద్రం బస్టాండ్ వద్ద టిడిపి నాయకులు జిల్లా వెంకట్రమణ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబును అరెస్టు చేయడం దారుణమన్నారు. ఇప్పటికే ప్రజలు వైసిపి పాలనపై ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి భంగపాటుతప్పదన్నారు. కార్యక్రమం లో జిల్ల రమేష్, యోగంజన రెడ్డి, చిన్న శివ రెడ్డి, మల్లికార్జున నాయక్, మురళీ నాయక్, శంకర పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

డంపింగ్‌యార్డ్‌ను తలపిస్తున్న వ్యర్థాలు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలవీధి డంపింగ్‌యార్డ్‌ను తలపిస్తోంది. ప్లాస్టిక్ కవర్లు చెత్త పేపర్లతో ఖాళీ ప్రదేశమంతా నిండిపోయింది. బుర్రలవీధి బాలికల ఉన్నత పాఠశాల ప్రధాన నాలుగు వీధులు ఉన్నాయి. చెత్తా, చెదారంతో దుర్గంధం వెదజల్లడంతో ఆదారిన వెళ్లాలంటే విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాల ఆవరణం కావడంతో దోమలు స్త్వైర విహారం చేయడంతో తమ పిల్లలు విషజ్వరాల బారిన పడే ప్రమాదముందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు దృష్టిపెట్టి వారానికి ఒకసారైన చెత్త తరలింపునకు చర్యలు చేపడితే ఈ పరిస్థితి ఉండదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి పరిష్కార్య చర్యలను చేపట్టాలని కోరుతున్నారు.

పాఠశాల వీధిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

జిల్లా హ్యాండ్ బాల్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక

పీలేరు : రాష్ట్ర పోటీలకు ఎంపికైన జట్టుతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పీలేరు

కెవిపల్లి మండలంలోని గ్యారంపల్లి గురుకుల జూనియర్ కళాశాలలో సమైక్య చిత్తూరు జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపిక పోటీలు జరిగాయి. ఆదివారం జరిగిన ఈ పోటీల్లో అవిభక్త చిత్తూరు జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలు పాఠశాల క్రీడ సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చెన్నకేశవులు సభాధ్యక్షులుగా వ్యవహరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల వేదికగా జిల్లా స్థాయి జట్టుకు క్రీడాకారుల ఎంపిక పోటీలు జరగడం సంతోషకరమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు బాలుర నుంచి ఒక జట్టు, బాలికల నుండి ఒక జట్టును ఎంపిక చేశారు. కర్నూలులో జరుగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాత చిత్తూరు జిల్లా జట్టు తరపున ఆడనున్నారు. ఎంపికైన క్రీడాకారు లను కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం అభినందించారు. ఈ ఎంపికలో పాత చిత్తూరు జిల్లాలోని 10 జూనియర్ కళాశాల నుంచి 110 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయ రామయ్య, రాష్ట్ర సభ్యులు సురేందర్ రెడ్డి, కోచ్ మెంబర్, పిఇటిలు, ఫిజికల్ డైరెక్టర్లు, స్థానిక గ్యారంపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బ్రహ్మేశ్, కళాశాల అధ్యాపకులు శేఖర్, వెంకటరమణ, కొండయ్య, అన్నపూర్ణ, ఫిజికల్ డైరెక్టర్ నరేంద్రబాబు హాజరయ్యారు. **రామాపురం :** మండలంలోని నీలకంఠ రావుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 31న మంగళవారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్-14, అండర్-17 త్రో బాల్ క్రీడ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, ఆర్గనైజర్ నరేంద్రకుమార్ రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలోని పిఇటిలు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకే హాజరై క్రీడాపోటీలు సజావుగా కొనసాగేందుకు సహకరించాలని కోరారు.

హంద్రీ-నీవా కాలువకు గండి

-మరమ్మతులు చేపట్టిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తంబళ్లపల్లి నియోజకవర్గం,బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని శెట్టిపల్లి వద్ద హంద్రీ-నీవా కాలువ గండిపడడంతో నీరంతా ఆలేటిపల్లి ఏరు మీదుగా నీళ్లు రంగసముద్రం చెరువుకి వెళ్తున్నాయి.సరైన వర్షపాతం లేక చెరువుల ఎండిపోతున్న సమయంలో చెరువులు నింపాలని ఉద్దేశంతో హంద్రీ-నీవా కాలువ కుండా ఒక్కొక్క చెరువు నీరు నింపాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నీరు వదిలింది.అయితే హంద్రీ-నీవా కాలువకు గండిపడి నీరంతా వృధాగా పోతుండగా,ఇది గమనించిన స్థానిక వైసిపి నాయకులు నీరు వృధా కాకుండా పెద్దతిప్పసముద్రం వద్ద ఉన్న నీటి సప్లై కేంద్రంలో నీరును ఆపివేశారు.మరమ్మతులు అనంతరం గండిపడ్డ చోట మరమ్మతులు చేయించి,తిరిగి నీరు వచ్చేలా చేసి కాండ్లకుంట చెరువుకు నీరు నింపుతామని తెలిపారు.

కాలువకు గండి పడటంతో వృధాగా పోతున్న నీరు

గండిని పూడ్చివేసిన వైసిపి నాయకులు

నాడు టమోటా.. నేడు ఉల్లి వంతు

15 రోజుల్లో కిలో ఉల్లిగడ్డలు రూ.20 నుంచి రూ.80

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మొన్నటి వరకు టమాటా ధర ఆకాశాన్నంటడంతో దేశవ్యాప్తంగా సామాన్య జనం ఇబ్బందులు పడిన విషయం మరువ కముందే.. కిలో టమాటా ధర అప్పట్లో రూ.200పైగా పలకడంతో ప్రజలు కొనాలంటేనే అల్లాడిపోయారు. నేడు ఉల్లిగడ్డలు సామాన్యులకు అందడంలేదు. దాదాపు నెల రోజుల క్రితం వరకు రూ.100కు ఆరు కిలోలు ఉల్లిగడ్డలు మార్కెట్‌లో లభించేవి. ప్రస్తుతం రూ.100కు కిలోన్నర ఉల్లి పాయలు మాత్రమే లభిస్తున్న పరిస్థితి. ఈ పరిస్థితుల్లో పేదలు ఉల్లిగడ్డలు కొనలేకున్నారు. సాధారణంగా అక్టోబరు, నవంబర్‌లలో ఖరీఫ్ సీజన్‌లో పండే ఉల్లి ఈ ఏడాది సెప్టెంబర్ మధ్యలో రావడం ప్రారంభమైంది. మహారాష్ట్రలో పంట విస్తీర్ణం 36 శాతం మేరకు తగ్గింది. కేవలం 58,000 హెక్టార్లకు పడిపోయింది. ఈ కారణంగా ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. గత రెండేళ్లుగా రైతులు నష్టపోవడంతో దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ పంట సీజన్‌లో ఉల్లిని విత్తడం తగ్గించారని, మరోవైపు ఈ రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉల్లి ఉత్పత్తి మరింత తగ్గించింది. 15 రోజుల క్రితం వరకూ కేవలం రూ.20 కి ఉల్లి ధర ఇప్పుడు రూ.80కి చేరింది. నాణ్యతలేని ఉల్లి కిలో రూ.50కి విక్రయిస్తున్నారు. కొత్త పంట డిసెంబర్‌కు వస్తుంది. అంతవరకు ఉల్లి ధరలు పెరుగుతాయని మార్కెట్ వర్గాలవారు అంచనా వేస్తున్నారు. ఈ ప్రకారం చూస్తే కిలో ఉల్లి ధర రూ.120 నుంచి రూ.150కి చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంటున్నారు.

అప్పులు చేయాల్సి వస్తుంది

ఈ ఏడాది వర్షాలు రాకపోవడంతో కూలి పనులేక జీవనం సాగించడానికి అప్పులు చేయాల్సి వస్తోంది. నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో జీవనం భారంగా మారింది.

- భవాని, వ్యవసాయ కూలీ, పులివెందుల

రాయితీతో ఉల్లిగడ్డలు సరఫరా చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్‌లో రాయితీతో ఉల్లిగడ్డలను ప్రజలకు అందించాలి. లేకపోతే సామాన్యులకు కష్టంగా ఉంటుంది.

- లక్ష్మీదేవి, గృహిణి, పులివెందుల

రేపు మైదుకూరులో ప్రజా రక్షణభేరి

మాట్లాడుతున్న సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ప్రజలకు వివరిస్తూ వారిని చైతన్యం చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం చేపట్టిన ప్రజారక్షణభేరి ఈనెల 31న మైదుకూరుకు చేరుకుంటుందని ఆ పార్టీ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిపిఎం మూడు చోట్ల నుంచి బస్సు యాత్రలు చేపట్టిందన్నారు. రాయలసీమలో కర్నూలు జిల్లాలో ప్రారంభమవుతుందన్నారు. మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు మైదుకూరులోని రాయల్ సర్కిల్ వద్ద బహిరంగ సభను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా స్టీల్‌ప్లాంట్ పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదాలేదన్నారు. నేటి పాలకులు రాష్ట్ర విభజన హామీలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాష్ట్రం విడిపోయే సందర్భంలో ఆనాడు బిజెపి ప్రతిపక్షంలో ఉండి రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇయ్యలేదు కాదు పదేళ్ళు ఇవ్వాలని పార్లమెంటులో మైకులు విరగ్గొట్టి గందరగోళం చేసిందన్నారు. ఈ రోజు రాష్ట్రానికి అన్యాయం చేస్తోందన్నారు. దీన్ని చూస్తూ రాష్ట్రంలో ఉన్న వైసిపి ప్రభుత్వం మద్దతు తెలుపుతోందని తెలిపారు. ఓట్లు వేసి అధికారం కల్పిస్తే కడప జిల్లా స్టీల్ ప్లాంటును, ప్రత్యేకహోదాను మరిచిందన్నారు. మళ్లీ అధికారం కోసం ప్రజలను మభ్యపెడుతూ సామాజిక సాధికార బస్సు యాత్ర పేరుతో ప్రజల దగ్గరకు వస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీలను తరిమికొట్టాలని సిపిఎం బస్సు యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎం.రమేష్, శాఖ సభ్యులు గౌస్ పాల్గొన్నారు.

మైలవరం : అసమానతలులేని అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ కోసం, సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజారక్షణ భేరి బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మైలవరం మండల కార్యదర్శి కొండయ్య కోరారు. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బహిరంగ సభకు సిపిఎం కమిటీ సభ్యులు, మాజీ శాసనసభ్యులు, ఎంఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, రాంభూపాల్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఓబులేసు, దాసు, సంజీవ రాయుడు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్రంలో పెరిగిపోతున్న అరాచక పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మదూరు పంచాయతీలోని చెంచుపల్లి, చిన్నవరదాయపల్లె గ్రామాల్లో బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచారని తెలిపారు. అన్యాయంగా కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అన్యాయంగా జైల్లో పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుందని పుట్టా ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దర్గా మరమ్మతులకు నిధులు మంజూరు

చాపాడు :మండల పరిధిలోని ఖాదర్‌పల్లె గ్రామంలో శిథిలావస్థలకు చేరుకున్న దర్గాకు మరమ్మతుల నిమిత్తం మైనార్టీ నిధుల ద్వారా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి రూ.4.90 లక్షలు మంజూరు చేయించారు. ఆ మేరకు శనివారం పంచాయతీరాజ్ ఏఇ తుళ్లియప్ప మరమ్మత్తులు చేపట్టాల్సిన దర్గాను పరిశీలించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జైనుల్లా, బోలోబాషా, స్థానికులు పాల్గొన్నారు.

నియామక పత్రాన్ని అందుకుంటున్న హరినాథ్

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా హరినాథ్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ కార్యదర్శిగా వలపాటి హరినాథ్‌ను ఎన్నుకు న్నారు. ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ గౌరవ అధ్యక్షులు టి.జి. వెంకటేష్ కర్నూలులో ఈ నియామక ఉత్తర్వులు హరినాథ్ కు అందించారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శిగా ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ పదవి తనకు అప్పగించిన గౌరవ అధ్యక్షులు టిజి వెంకటేష్, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్న రామసత్యనారాయణ, మాజీ అధ్యక్షులు జయంతి వెంకటేశ్వర్లు తెలిపారు.

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రతాపరెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన బిజెపి నాయకుడు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామ సర్పంచ్ సోదరుడు బిజెపి టెక్నికల్ కమిటీ జిల్లా అధ్యక్షుడు కొణిరెడ్డి ప్రతాపరెడ్డి ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ అల్లా ప్రకాష్ , రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోసాల దేవి ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కుల మత రాజకీయాలు చేయడంతో అన్ని కులాలు అన్ని మతాలకు ప్రాంతాలకు కలుపుకొని పోయే ఏకైక పార్టీ కాంగ్రెస్‌పార్టీ మాత్రమేనని అన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. 2024 సంవత్సరంలో రాహుల్‌గాంధీ కాంగ్రెస్ పార్టీ జయ కేతనం ఎగరవేయడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నకృష్ణ, ఖాదర్, రమణ, నూరుల్లా, ఇమ్రాన్ పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని ఎర్రగుడిపల్లిలో జరుగుతున్న డ్రయినేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అన్నారు. ఆదివారం డ్రయినేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమం మున్సిపల్ డిఇ సురేంద్ర, కౌన్సిలర్ పురుషోత్తమ్ డేనియల్, కో-ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేశారు. శ్రీ బాలాజీ, బాలాజీ ఈవెంట్స్, డేకార్స్ మరియు బృందావన్ ఫంక్షన్ హాల్ వారి సౌజన్యంతో నాట్యాచార్యులు మానస ఆధ్వర్యంలో మానస నృత్య శిక్షణ కేంద్రం ధర్మవరం చిన్నారులచే ఏర్పాటు చేశారు. క్లాసికల్, జానపద నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీబాలాజీ, పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా పాఠశాల భవనం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వీరభద్రపురం ప్రభుత్వ పాఠశాల నిరుపయోగంగా మారింది. మూడు సంవత్సరాల క్రితం పాఠశాలలో విద్యార్థులు లేరనే కారణంతో మూసివేశారు. అప్పటినుండి భవనాలు నిరుపయోగంగా మారాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాలు ఏర్పాటు చేసి నూతన భవనాలను నిర్మిస్తోంది. సచివాలయం, ఆర్బికె, హెల్త్ క్లినిక్ భవనాలను రూ.85 లక్షలు వెచ్చిస్తోంది. అధికారులు ముందుచూపుతో ఇలా నిరుపయోగంగా మారిన భవనాలను ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకుంటే ప్రభుత్వ సొమ్ము వృథా కాదని పలువురు సూచిస్తున్నారు. వీరభద్రపురంలో మూతపడిన పాఠశాల ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

దళిత యువకుడిపై దాడి అమానుషం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

దళిత యువకుడు బెనర్జీపై టిడిపి నాయకులు కత్తులతో దాడి చేయడం అమానుషమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక్కప్పు సమాజంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు వైసిపి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తూ ఉంటే.. టిడిపి నాయకులు వారిని కించపరిచేలా ప్రవ ర్తిస్తున్నారని విమర్శిం చారు. మాట వినకుంటే మచ్చుకత్తితో దళిత యువకుడిపై దాడి చేయడం ఏమి టని ఆయన ప్రశ్నించారు. టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ తన అనుచరులు భరత్ కుమార్‌రెడ్డి, రామతో కవ్వింపు చర్యలకు పాల్పడ్డారన్నారు. శనివారం బెనర్జీ వైసిపి నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సుయాత్ర పనుల్లో భాగంగా వెళుతుంటే శివాలయం రోడ్డు నుండి వెంబడించి గాంధీ రోడ్ మీద దాడి చేశా రన్నారు. మావటాదారిగా ఈ దాడిని ఖండిస్తున్నానని, రౌడీయిజాన్ని తాను ఏనాడూ ప్రోత్సహించనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వీరిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, ప్రాంతం దళితలో కఠినంగా వ్యవహరించాలని ఎస్‌పిని కోరారు. చట్ట పరంగా తాను వెళ్లానని, పోలీసులు వేగవంతంగా వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వంటిదే సరోజ, కౌన్సిలర్ సత్యం, ఇట్స్ వైస్ చైర్మన్ జేర్మాది శారద, మాల మహానాడు నేషనల్ ప్రెసిడెంట్ గోస మనోహర్, నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

20 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..మండలంలోని తవళం గ్రామం చౌకిల్లావారిపల్లెకు చెందిన పఠాన్ అజీజ్ (75)అనే వ్యక్తి పల్లెకు సమీపంలో నాటు సారాను తీసుకువచ్చి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. ఆ సమాచారం మేరకు నాటు సారా విక్రయ స్థావరంపై పోలీసులు దాడి చేసి పఠాన్ అజీజ్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పఠాన్ అజీజ్‌ను అరెస్టు చేసి, కేసు నమోదు చేసి, రిమాండ్ కు పంపినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.